క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న ఎన్నికల పరిశీలకులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని మంగళవారం జిల్లాలోని మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల ఎన్నికల జనరల్ పరిశీలకులు నరేంద్ర సింగ్‌బాలి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు, ఆలయ అధికారులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ఓటరు స్లిప్‌ల పంపిణీ



నందిగామ: ఓటర్లందరికీ ఓటరుస్లిప్‌ల పంపిణీ కార్యక్రమం నందిగామ నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతోంది. నియోజకవర్గంలోని 222 పోలింగ్ కేంద్రాల పరిధిలోని బీఎల్వోలు, తమ పరిధిలోని ఓటర్లకు స్లిప్‌లను పంపిణీ చేస్తున్నారు. ఓటరు స్లిప్‌ల పంపిణీ ఇప్పటికే 30శాతం పూర్తయిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు తెలిపారు.

ఈవీఎంల ఏర్పాటుపై సిబ్బందికి శిక్షణ



నందిగామ: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎన్నికల సిబ్బందికి ఈవీఎంల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ రవీంద్రరావు మాట్లాడుతూ పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు ఏర్పాటు చేసుకునే విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఎన్నికల సిబ్బందికి, మాస్టర్ ట్రైనర్స్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నందిగామ తహసిల్దార్ వై సరస్వతి , డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్ ప్రసాద్, నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి పది కుటుంబాలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఏడో వార్డుకు చెందిన నల్లగొండ కృష్ణతో పాటు 10 కుటుంబాలవారు మంగళవారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిని పార్టీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనకు మెచ్చి పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం

- పార్టీలో జోష్ నింపుతున్న చేరికలు
- 99శాతం హామీలు నెరవేర్చడంపై సర్వత్రా హర్షం
- ప్రచారంలో దూసుకుపోతున్న సామినేని ఉదయభాను



శనగపాడులో ఎన్నికల ప్రచార సంబరాల్లో వైఎస్సార్ సీపీ అభిమానులు

పెనుగంచిప్రోలు: సార్వత్రిక ఎన్నికల్లో జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు నూతనోత్తేజంతో కదం తొక్కుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న విప్ సామినేని ఉదయభాను రాజకీయ సమర్థత, ఎన్నికల వ్యూహం, రోజురోజుకు పార్టీలోకి పెరుగుతున్న చేరికలు, ఇటీవల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో కూడా పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజానికి ప్రధాన కారణమని చెప్పవచ్చు.

ఆరోసారి బరిలో ఉదయభాను..

సామినేని ఉదయభాను జగ్గయ్యపేట నుంచి ఆరోసారి ఎన్నికల బరిలో నిలిచారు. 1999, 2004 వరుస ఎన్నికల్లో గెలుపొందిన ఉదయభాను తిరిగి 2019లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. జగ్గయ్యపేటలో ఓసారి ఓడిన వ్యక్తి తిరిగి మళ్లీ విజయం సాధించిన దాఖలాలు లేవు. కాని ఉదయభాను 2019లో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందడం ద్వారా ఆ చరిత్రను తిరగరాశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలవైపు ఆకర్షితులైన ఉదయభాను సుదీర్ఘ రాజకీయప్రస్థానం, రాజకీయ చాతుర్యం, పదునైన వ్యూహాలు తన ప్రత్యర్థులను సైతం ఆశ్చర్యచకితులను చేస్తుంటాయి. గతంలో వరుసగా రెండుసార్లు ఓడినప్పటికీ 2019లో తిరిగి జగ్గయ్యపేటలో గెలుపు జెండా ఎగురవేయడం ఉదయభాను రాజకీయసమర్థతకు నిదర్శనమని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న ఉదయభానుడు..

భానుడి మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఈ ఉదయభానుడు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసి, పోలింగ్‌కు కేవలం 12రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఉదయభాను తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికే ఆయా వర్గాలు, సంఘాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించిన ఉదయభాను, ఈ ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల అభ్యున్నతికి తాను చేసిన కృషిని వివరించారు. అందరినీ కలుపుపోతూ రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించేదిశగా పావులు కదుపుతున్నారు.

పార్టీలో భారీగా చేరికలు..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో పాటు పేట నియోజకవర్గాన్ని వందలాది కోట్లతో ఉదయభాను అభివృద్ధిపథంలో నడిపించడాన్ని గమనించిన ఆయాపార్టీలకు చెందిన నాయకులు, తటస్థులు వైఎస్సార్‌సీపీ వైపు ఆకర్షితులవుతున్నారు. ఇప్పటికే పలువురు నాయకులతోపాటు సుమారు 1500 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరడంతో పార్టీలో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఎన్నికల బరిలో నిలిచి నామినేషన్ ఉపసంహరించుకున్న ఓవ్యక్తి సైతం తన మద్దతును ఉదయభానుకే ప్రకటించడం పేట రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీసింది. వైఎస్సార్‌సీపీకి లభిస్తున్న విశేష ఆదరణకు నిదర్శనంగా నిలిచింది.

పేట అభివృద్ధిపై చెరగని ముద్ర..

జగ్గయ్యపేటకు ప్యాసింజర్ రైలు తీసుకువచ్చేందుకు ఉదయభాను విశేషంగా కృషిచేయగా, రూ.1450 కోట్లతో చేపట్టిన రైల్వే డబ్లింగ్ పనులు కొనసాగుతున్నాయి. రూ.కోటితో హైవే బస్టాండ్, రూ.14కోట్లతో చిల్లకల్లు-జగ్గయ్యపేటకు సెంట్రల్ లైటింగ్‌తో నాలుగు లైన్ల రహదారి, రూ.14 కోట్లతో శ్రీతిరుపతమ్మవారి ఆలయం అభివృద్ధి చేపట్టారు. కృష్ణానదిపై ముక్త్యాల నుంచి మాదిపాడుకు బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.60కోట్లు మంజూరు చేయించారు. ఇలా ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను నేతృత్వంలో మొత్తం రూ.560కోట్లతో జగ్గయ్యపేట నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధిపనులు చేపట్టిన వైనం ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయఅంశంగా మారాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గ ప్రజల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా రూ.1245 కోట్లు జమ కావడం కూడా ప్రజాసంక్షేమానికి ఆపార్టీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధిపై ఉదయభాను తనదైన ముద్రవేశారనే చర్చ ప్రజల్లో జోరుగా సాగుతోంది.

మేనిఫెస్టోపై పెరిగిన విశ్వాసం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలు పూర్తిగా విశ్వసిస్తున్నారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారాల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొంటుండటమే ఇందుకు నిదర్శనం. ఆయా సంక్షేమ పథకాల ద్వారా ఈఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచిన వైనాన్ని గుర్తుచేసుకుంటూ ప్రజలు ఈ ఎన్నికల్లో పూర్తి మద్దతు ప్రకటిస్తున్నారు. గతఎన్నికల మేనిఫెస్టోలో 99శాతం హామీలు నెరవేర్చినందున 'మా నమ్మకం నువ్వే జగన్' అని జనం నినదిస్తున్నారు. ఇక టీడీపీకి ప్రధాన వెన్నుదన్నుగా ఉండే సామాజికవర్గానికి చెందిన పలువురు నాయకులు సైతం టీడీపీకి దూరంగా ఉంటుండటం వైఎస్సార్ సీపీకి లాభించనుంది. ఇలా వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉదయభాను తన సుదీర్ఘ రాజకీయం అనుభవానికి తోడు నిత్యం పదునైన వ్యూహాలతో ముందుకు సాగుతుండటం ఆపార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నింపుతోంది. భారీ మెజార్టీ సాధించే దిశగా పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి.

అభివృద్ధిని చూసి ఓటేయండి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామలో ఓట్లు అభ్యర్థిస్తున్న డాక్టర్ జగన్ మోహనరావు



డాక్టర్ జగన్‌మోహనరావుకు హారతిచ్చి దీవిస్తున్న మహిళ

నందిగామ టౌన్: నందిగామ పట్టణంలో గడిచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రజలను కోరారు. నందిగామ పట్టణంలోని గుర్రాలపేట, బజాజ్ షోరూమ్, బీసీ కాలనీ, వివేకానంద పాఠశాల ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యేకు మహిళలు ఎదురేగి హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ నందిగామ పట్టణ సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు కృషిచేసినట్లు వివరించారు. ఈ ఐదేళ్లలో మేలు జరిగింది అనుకుంటేనే మద్దతు పలికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణంలోని సీఎం రోడ్డును విస్తరించి అభివృద్ధి చేశామని తెలిపారు. రామన్నపేట, చందర్లపాడు రోడ్లను సైతం అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించి 80 శాతం పనులు పూర్తి చేశామన్నారు. గాంధీ సెంటర్ సుందరీకరణ, కేంద్రీయ విద్యాలయం, రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటుతోపాటు అనేక అభివృద్ధి పనులు చేసినట్లు గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపాలనలో బీసీలకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. నందిగామలో తాము చేసిన అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ కోలేటి నాగరాణి, నాయకులు ఓర్సు జ్వాలా, తోట అంజారావు, వల్లెపు రవి, పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు, కొమ్ము విజయరాజు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కన్నెకంటి జీవరత్నం, షేక్ ఫాతిమా, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన



నూతన ఓటర్లకు ఓటుకార్డులు పంపిణీ చేస్తున్న నరేంద్రసింగ్‌బాలి, అధికారులు



పెనుగంచిప్రోలులో ర్యాలీలో పాల్గొన్న నరేందర్ సింగ్‌బాలి, ఆర్వో వెంకటేశ్వర్లు, సిబ్బంది

నందిగామ: ప్రతిఒక్కరూ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ నరేందర్ సింగ్ బాలి పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు పర్యవేక్షణలో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ నందిగామ పట్టణంలో మంగళవారం ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల ఎన్నికల జనరల్ అబ్జర్వర్ నరేంద్రసింగ్ బాలి మాట్లాడుతూ ఓటు హక్కు ఎంతో విలువైనది అన్నారు. త్వరలో జరగనున్న నందిగామ నియోజకవర్గంలో నూటికి నూరు శాతం ఓటర్లు, తమ ఓటుహక్కును వినియోగించుకుని రికార్డు సృష్టించాలన్నారు. నూతనంగా ఓటుహక్కు పొందిన పలువురికి ఓటరు కార్డులను అందజేశారు. ఓటు ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హేమమాలిని, నందిగామ తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో విశ్వనాథ్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో అవగాహన ర్యాలీ..

పెనుగంచిప్రోలు: ఓటు ప్రాధాన్యాన్ని గుర్తించి అందరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం నియోజకవర్గాల ఎన్నికల జనరల్ అబ్జర్వర్ నరేందర్‌సింగ్ బాలి సూచించారు. ఓటు ప్రాధాన్యంపై ప్రలజకు అవగాహన కల్పిస్తూ పెనుగంచిప్రోలులో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి. వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వి అమ్మాజీ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే జనానికి మేలు

విప్ ఉదయభాను



తోటచర్లలో ఓటర్లకు అభివాదం చేస్తున్న ఉదయభాను



ఉదయభానుతో కరచాలనం చేసేందుకు పోటీపడుతున్న ప్రజలు

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జగ్గయ్యపేట నియోజకవర్గంలో తానుచేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రజలంతా వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని తోటచర్ల, వెంకటాపురం, కె.పొన్నవరం, శనగపాడు, వెంగనాయకునిపాలెం, కొళ్లికూళ్ల, సుబ్బాయిగూడెం గ్రామాల్లో మంగళవారం ఆయన ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయభానుకు ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. మండుటెండను సైతం లెక్కచేయక మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని పూలవర్షం కురిపించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలోనే జనానికి మేలు చేకూరిందన్నారు. మళ్లీ ఐదేళ్లపాటు సంక్షేమ పథకాలు అమలు కావాలంటే అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. నియోజకవర్గాన్ని వందలాది కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేశానన్నారు. మాజీఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య నియోజకవర్గంలో ఏ అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, సర్పంచులు కునగుంట్ల రాములమ్మ, కూచి నర్సయ్య, జొన్నలగడ్డ కిషోర్, పాపినేని వెంకటేశ్వరరావు, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, వెంకటాపురం ఎత్తిపోతల పథకం చైర్మన్ పొన్నం వెంకటేశ్వరరావు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు కుంటముక్కల శ్రీనివాసరావు, పారుపల్లి నాగేశ్వరరావు, కోనంగి ముక్కంటి, ఎంపీటీసీ సభ్యులు కీసర లోకేశ్వరరావు, వెల్ది ప్రభాకర్, ఆలయ డైరక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ నగదు బ్యాంకు ఖాతాల్లో ...

నందిగామ: మే నెలకు సంబంధించిన సామాజిక పింఛన్ల నగదును పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిగామ పట్టణ పరిధిలో మొత్తం 4,274 మంది సామాజిక పింఛన్‌దారులు ఉండగా, వీరిలో 3,324 మంది లబ్ధిదారులకు డీబీటీ పద్ధతిలో నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని వివరించారు. మిగిలిన 950 మంది వృద్ధులు, దివ్యాంగులు, డయాలసిస్ పేషంట్‌లకు ఆయా సచివాలయాల సిబ్బంది బుధవారం నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పింఛన్ అందజేస్తారని తెలిపారు. పింఛన్ కోసం ఎవ్వరూ సచివాలయాలకు వెళ్లవద్దని సూచించారు. ఏదైనా కారణాలతో పింఛన్ నగదు బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోతే, మే 2, 3వతేదీల్లో లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే అందజేస్తామని వివరించారు.

ముగిసిన స్వస్థత మహాసభలు



నందిగామ: పట్టణ పట్టణ శివారు బైపాస్ రోడ్డు ప్రాంతంలోని అయ్యప్పనగర్‌లో క్రీస్తు సువార్త స్వస్థత మహాసభలు మంగళవారం రాత్రితో ముగిశాయి. ఈనెల 28వ తేదీన ప్రారంభమైన మహాసభల్లో పలు ప్రాంతాల నుంచి హాజరైన దైవసేవకులు ప్రసంగించారు. క్రీస్తు బోధనలు ఆచరణీయమని పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

జగన్‌మోహనరావును గెలిపించాలంటూ ప్రచారం



పెండ్యాలలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ మలక్‌బషీర్, నాయకులు

కంచికచర్ల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని కోరుతూ ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, ఎంపీటీసీసభ్యులు షేక్ బడే హజరత్ మండలంలోని పెండ్యాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో మాజీ సర్పంచి షేక్ ఖాజాపాషా, మాజీ ఎంపీటీసీ సభ్యులు షేక్ చాన్‌బహుదూర్, నాయకులు షేక్ గౌస్, షేక్ పీర్ సామియా, షేక్ నిస్సార్, అబ్దుల్‌కరీం, షేక్ షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల, పరిటాల గ్రామాల్లో ..

నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎంపీ అభ్యర్థి కేశినేని నానిలను గెలిపించాలని కంచికచర్ల, పరిటాల, గండేపల్లి, కీసర తదితర గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రచారంలో ఆ పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వి.సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, గుగులోతు ఇందిర, బండారుపల్లి నాగపుష్పలీల, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, నాయకులు చింతా రవీంద్రనాథ్, దాసరి రాము, మార్త శ్రీనివాసరావు, యద్దనపూడి విజయారావు, వేముల నాగరాజు, వేముల జీవరాజు, మట్టా శ్రీనివాసరెడ్డి, సర్పంచులు బొక్కా రవికుమార్, యద్దనపూడి ఆనందజ్యోత్స్న, నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, అమర్లపూడి యోహాన్, దేవరకొండ గురవయ్య, దాదె బుచ్చిబాబు, పొన్నపల్లి శ్రీనివాసరావు, నారిశెట్టి శ్రీనివాసరావు, దేవిరెడ్డి శ్రీనివాసరావు, మేకల బాబు, యర్రంశెట్టి బాలయ్య, బడేటి మల్లి, గ్రంధి ఆదిత్య, మాడుగుల సామ్యేలు, శేషం మధుబాబు, ఆంజనేయులు, తంగిరాల సృజినీ కుమార్, పరిటాల రాము, వేల్పుల రమేష్, పాపట్ల స్వామి, చలమల ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉదయభాను గెలుపు కోరుతూ ప్రచారం



ఉదయభానును గెలిపించాలని కోరుతున్న ఆయన సతీమణి విమలాభాను



ఓట్లు అభ్యర్థిస్తున ఎమ్మెల్యే ఉదయభాను కుమార్తె పద్మప్రియాంక

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను గెలుపు కోరుతూ ఆయన సతీమణి సామినేని విమలాభాను, సోదరీమణులు జయశ్రీ, చాముండేశ్వరి(బేబి), కుమార్తె పద్మ ప్రియాంక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగ్గయ్యపేట పట్టణంలోని 31వ వార్డు శాంతినగర్, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. విజయవాడ ఎంపీగా కేశినేని నాని, పేట ఎమ్మెల్యేగా ఉదయభానును గెలిపించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా, మున్సిపల్ కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రావు, కాశి అనురాధ, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని 25,26,27 వార్డులకు చెందిన 61,62 పోలింగ్‌బూత్‌ల పరిధిలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఉదయభాను చేసిన అభివృద్ధిని వివరించారు. 22వవార్డు నాగమయ్య బజారులో వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వత్సవాయి మండలంలో...

భీమవరం(వత్సవాయి): ఉదయభాను, కేశినేని శ్రీనివాస్(నాని)ల విజయాన్ని కాంక్షిస్తూ భీమవరంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు చింతకుంట్ల వెంకటరెడ్డి మంగళవారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. గుండం రంగారెడ్డి, ఎంపీటీసీ కొమెర చెన్నమ్మ, గంగిపోగు రమేష్, సర్పంచ్ కే మాధురి, సొసైటీ అధ్యక్షులు పెనుగొండ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగుల్‌హుస్సేన్ పాల్గొన్నారు.

ఘనంగా మహాకవి శ్రీశ్రీ జయంతి

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక గ్రంథాలయంలో మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) 114వ జయంతిని రసమయి సాహితీ సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మహాకవి చిత్రపటానికి రాసమయి సాహితీ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, కవి దోసపాటి నాగేశ్వరరావు, సాహిత్యాభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దోసపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని శ్రీశ్రీ కొత్త పుంతలు తొక్కించారన్నారు. సంప్రదాయ కవితా విధానాన్ని తోసిరాజని కార్మిక, కర్షక, పీడిత వర్గాల బతుకులను కవితా వస్తువులుగా ఎన్నుకున్నారని కొనియాడారు.

గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సాహిత్యాభిమానులు మద్దాల ఏసుపాదం, ఆడెపు గోపాలరావు, భూక్యా అశోక్, గుగులోతు వెంకటరావు, బాణావత్ గోపి, మోచర్ల మాలతి, ఇనుపనూరు వేణు, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు అడిగే అర్హత చంద్రబాబుకు లేదు

చందర్లపాడు(నందిగామ): హక్కుల కోసం పోరాడితే తన పాలనలో అక్రమ కేసులు బనాయించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు మాదిగలను ఓటు అడిగే అర్హతలేదని ఎమ్మార్పీఎస్ ఆంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు దొండపాటి సుధాకర్ మాదిగ అన్నారు. మండలంలోని చందాపురంలో మంగళవారం పలువుర ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను కలవడంతోపాటు పలుచోట్ల సమావేశం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మాదిగల హక్కుల కోసం నిర్వహించిన కురుక్షేత్ర మహాసభ సందర్భంలో మాదిగలను చిత్రహింసలు పెట్టారని గుర్తుచేశారు. ఎమ్మార్పీఎస్ ఆంధ్ర నాయకులు కనకపూడి వెంకటరత్నం, కొండ్రు రాజారావు, యద్దనపూడి లక్ష్మణ్, కోట సత్యానందం, గుండె పోగు రాములు, బాబురావు పాల్గొన్నారు.